క్లుప్తంగా

వైభవంగా ముగిసిన జాతర


అంజన్నకు పూజలు చేస్తున్న భక్తులు

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం నరసారెడ్డిపల్లె సమీపంలో పాలాల బండ వద్ద వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి జాతర ఆదివారంతో ముగిసింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేకపూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం రాత్రి చాందనీబండ్లు కట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

చల్లంగా చూడమ్మా..గంగమ్మా


జాతరలో పాల్గొన్న రామిరెడ్డి ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్: చల్లంగా చూడమ్మ.. గంగమ్మ అంటూ భక్తులు వేడుకున్నారు. రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజుపురం గ్రామంలో గంగమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలతో అందరూ సుభిక్షంగా ఉండాలని గంగమ్మను ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే నిర్వహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కె. నాగేంద్ర రెడ్డి, కె. శ్రీనివాసులు రెడ్డి, అనీల్, ప్రతాప్‌రెడ్డి, బి. శివారెడ్డి పాల్గొన్నారు.

అమ్మను మించిన దైవం లేదు


కేక్ కట్ చేస్తున్న మాతృమూర్తులు

రైల్వేకోడూరు అర్బన్: సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని పాస్టర్ ఇమానియేల్ బాబు అన్నారు. పట్టణంలోని ఎస్‌కేఎల్‌సీ చర్చిలో మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పలువురు మాతృమూర్తులు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలెం బాబు, విజయ్ బాబు, ప్రకాష్ పాల్గొన్నారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

రాయచోటి జగదాంబసెంటర్ : పినాకా ట్రస్టు వ్యవస్థాపకులు యాదగిరి ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహిస్తున్నట్లు కోర్సు డైరెక్టర్లు కె.రఘునాథ, జి.వెంకటశివ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి పరిసర ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15 నుండి జూన్ 6వ తేదీ వరకు రాయచోటి పట్టణం బోసనగర్‌లోని శ్రీ షిర్డీ సాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణా కాలంలో విద్యార్థులకు ఉచిత మెటీరియల్, మధ్యాహ్న భోజన సౌకర్యం కూడా కల్పిస్తామని పేర్కొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న మనవతా సభ్యులు

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం కస్పాలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో రాయచోటి మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీవెంకటేశ్వర అరవింద్ ఐ హాస్పిటల్ తిరుపతి వారిచే కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు మానవతా చైర్మన్ శివగంగిరెడ్డి, అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మానంద్‌రెడ్డి, కన్వీనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. వైద్యులు సుధీర్, భావన పరీక్షలు నిర్వహించి వారిలో దృష్టిలోపం ఉన్నవారికి చికిత్స నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన వారికి అరవింద్ తిరుపతి ఆసుపత్రికి సొంతవాహనంలో తీసుకెళ్లి కంటి ఆపరేషన్ చేయించి వారి గ్రామాలకు పంపుతామన్నారు. అనంతరం ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జయచంద్రారెడ్డి, షకీల్, వెంకటరమణ నాయుడు, సుదర్శన్‌రెడ్డి, పీరయ్య, శివరామక్రిష్ణ, చంటి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దబలిజపల్లె సమీపంలో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. అక్కడ జూదం ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.55,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామాల్లో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పచ్చిరొట్టతో పచ్చని పొలాలు!

రైతులు రసాయన ఎరువులు ఇష్టా రాజ్యంగా వాడడం వలన నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. దీంతో దిగుబడులు తగ్గుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద తగ్గడంతో భూమికి సేంద్రియ ఎరువుల వాడకం తగ్గింది. ఈ క్రమంలో భూసారం పెంపునకు పచ్చిరొట్ట ఎరువులు వాడాల్సిందే. భూమికి సేంద్రియ పదార్థం అందడం వల్ల నేలలో సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి తద్వారా పంట వేర్ల పటుత్వం పెరుగుతుంది.

- తక్కువ ఖర్చుతో నేల సారవంతం
- రసాయన ఎరువులతో నష్టమంటున్న అధికారులు


పచ్చిరొట్టని సాగు చేసిన రైతు

పుల్లంపేట : పచ్చిరొట్ట సాగు పంట దిగుబడిలో ప్రధాన భూమిక పోషిస్తుంది. భూసారం పెంపులో దిట్ట. భూముల్లో రేగడి మట్టి పోసేకంటే నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట ఎరువు సాయంతో సారవంతంగా భూమిని మార్చుకోవచ్చని ఉద్యాన వనశాఖ అధికారి భాస్కర్ తెలిపారు. మరికొన్ని రోజుల్లో మండల వ్యాప్తంగా వర్షాలు ప్రారంభం కానున్నాయి. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట, ఓబులవారిపల్లి, పెనగలూరు, చిట్వేలి, మండలాల్లో సుమారు 10 వేల హెక్టార్లలో అరటి పంట సాగు చేయడానికి రైతులు సంసిద్ధమవుతున్నారు. ఈ సమయంలో రైతన్నలకు పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర పూత దశ రాకమునుపే భూమిలో కలియ దున్నితే నిర్జీవమైన పుడమి జీవం పోసుకుంటుందని ఉద్యానశాఖ అధికారి తెలిపారు. జనుము, జీలుగ, అలసందు, పిల్లిపెసర, నవధాన్యాలు వంటి పైర్లు పూత దశ వచ్చేవరకు పెంచి భూమిలో కలియ దున్నితే పచ్చిరొట్ట ఎరువు తయారవుతుంది. పశువుల పేడ కంటే పచ్చిరొట్ట భూమికి పదిరెట్లు సారవంతం పెరుగుతుంది.

ఏఏ విత్తనం ఎంత లాభమంటే..

జీలుగ

ఎకరా జీలుగ సాగుకు 12 నుంచి 16 కిలోల విత్తనం అవసరం. ఈ పైరు ద్వారా 6 నుంచి 8 టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. దీనిని పొలంలో దున్నడంతో నత్రజని-30, భాస్వరం-8, పొటాషియం -25 కిలోలు పొందవచ్చు. ఎక్కువగా మాగాణి భూములలో సాగు చేసుకుంటే మంచిది. అరటి చెట్లు వేపుగా పెరుగుతాయి.

జనుము

ఎకరా జనుము సాగుకు 20 కిలోల విత్తనం కావాలి. పచ్చిరొట్ట 4 నుంచి 6 టన్నులు వస్తుంది. నత్రజని - 40, భాస్వరం - 6, పొటాషియం - 20 కిలోలు వస్తుంది. పూత రాకముందే భూమిలో కలియదున్నాలి.

పిల్లి పెసర

ఎకరా పిల్లిపెసర సాగుకు 6 నుంచి 20 కిలోలు చల్లుకోవాలి. పంట కోత దశలో దుక్కులు చేసుకుంటే 2 నుంచి 3 టన్నులు పచ్చిరొట్ట వస్తుంది. దీని ద్వారా నత్రజని 18, భాస్వరం 2.5, పొటాషియం 13 కిలోలు వస్తుంది.

లక్ష్మీనరసింహస్వామి దీవెనలతో సుభిక్షంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

వీరబల్లి: లక్ష్మీనరసింహస్వామి, చిన్న గంగమ్మ దీవెనలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం పెద్దివీటి పంచాయతీ మాండవ్య నది ఒడ్డున వెలసిన లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ వీరబల్లి మండల ప్రజలకు తాను ఎంతగానో రుణపడి ఉన్నానని, ఎన్నికల్లో తన గెలుపు విజయానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాలివీటి విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనాగిరెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వివేకానంద రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు శివరాం గౌడ్, బీసీ సెల్ నాగభూషణం, అన్నమయ్య వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిగుట్ల అమర్నాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు నాగిరెడ్డి, గోపినాథ రెడ్డి, చంద్ర, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, అన్నమయ్య జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు నరేష్ స్వామి, మణిరాజు, నరేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆరెమ్మ తిరునాల


ప్రత్యేక అలంకరణలో ఆరెమ్మ తల్లి

సుండుపల్లె : మండల కేంద్రంలో వెలసిన ఆరెమ్మ తల్లి తిరునాల మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఎర్రపురెడ్డి ఆరంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం సాయంత్రం అమ్మవారు పత్తివాండ్లపల్లె నుండి అంగరంగ వైభవంగా మేళతాళములతో ఊరేగింపుగా బయలుదేరి ఆలయానికి చేరుకుంటారని తెలిపారు. మంగళవారం ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలోని ప్రజలందరూ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను సేకరించి, తిరునాల మహోత్సవాన్ని తిలకించాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థులే కళాశాలకు పట్టుకొమ్మలు


పూర్వపు విద్యార్థులతో డాక్టర్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యాసంస్థల్లో చదివిన పూర్వ విద్యార్థులే ఆ సంస్థలకు పట్టుకొమ్మల్లాంటివారని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఎం.సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి పట్టణం మాసాపేటలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ 2011–2015 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇది కేవలం నిర్మాణం మాత్రమే కాదు.. ఇది కళాశాల పట్ల ఉన్న ప్రేమ, విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పాఠశాల–విద్యార్థుల మధ్య ఉన్న అనుబంధాన్ని బలపరుస్తాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

రాయచోటి టౌన్ : రోగులకు ఉచితంగా వైద్యం అందించడం అభినందనీయమని టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో ఎంఏ వెల్ఫేర్ సొసైటీ, లైఫ్ కేర్ క్లీనిక్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమని పేర్కొన్నారు.

డిప్లొమాతో ఉద్యోగాలకు బాటలు



మాట్లాడుతున్న రిటైర్డ్ జేడీ ఎంబీ రమేష్

రాయచోటి టౌన్ : డిప్లొమా కోర్సుల ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పశుసంవర్ధక శాఖ విశ్రాంత జేడీ ఎంబీ రమేష్ అన్నారు. ఆదివారం రాయచోటి పరిధిలోని యండపల్లె సమీపంలో అర్చనా విద్యాసంస్థల సముదాయంలో పశుసంవర్ధక డిప్లొమా పూర్తి చేసుకున్న విద్యార్థులకు కాన్వొకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో డిప్లొమా కోర్సుల ద్వారా ఉద్యోగ అవకాశాలతో పాటు, జీవనోపాధి కూడా లభిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస రాజు, డైట్ అధ్యాపకుడు మడితాటి నరసింహారెడ్డి, అర్చనా విద్యాసంస్థల కరస్పాండెంట్ పాపిరెడ్డి మదన్ మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ మౌలాలి, డైరెక్టర్ పాపిరెడ్డి లక్ష్మి, డాక్టర్ ప్రసాద్, అధ్యాపకులు అనిల్‌కుమార్, డాక్టర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

పెనగలూరు: మండలంలోని ఈట రామాపురం గ్రామం లక్ష్మీనరసింహస్వామి కొండపై వెలసిన పెంచల లక్ష్మి నరసింహస్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏటిరామాపురం రాజుపాలెంకు చెందిన రాజులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ఆలయంలో నరసింహస్వామిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. టీటీడీ వారిచే అన్నమయ్య సంకీర్తనల కార్యక్రమం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. వేద పండితులు ఆలయం వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ వైస్ చైర్మన్ గూండాల్ రెడ్డి, మహేశ్వరి దంపతులు ఏర్పాటు చేశారు.

ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణులకు వరం

కురబలకోట: ఉచిత వైద్యశిబిరాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు వరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ అన్నారు. ఆదివారం అంగళ్లు జడ్పీ హైస్కూల్‌లో బెంగళూరులోని వైదేహి కార్పోరేట్ ఆసుపత్రిచే కాపు (బలిజ) సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి సీతారాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. వివిధ ప్రాంతాలకు చెందిన వారు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య బృందం వివిధ పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు మందులు, మాత్రలు అందజేశారు. ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సాయిలోకేష్ మాట్లాడుతూ అంగళ్లు లాంటి ప్రాంతంలో వైద్య శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు.

వేసవి తాపం.. వాహనాలు జరభద్రం

- జాగ్రత్తలు తప్పనిసరి
- నిపుణుల సూచన


పాతబస్టాండు సర్కిల్‌లో ఎండలోనే పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

రాజంపేట టౌన్: భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు మండిపోతున్నాయి. మనిషి ఎండ నుంచి రక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటాడో వాహనాలను కాపాడుకునేందుకు కూడా జాగ్రత్తలు తీసుకోవాల్సివుంది. వాహనాలు ఎండలో గంటల కొద్ది ఉండటం వల్ల ముఖ్యంగా పెట్రోల్ ఆవిరి అయిపోతుంది, అలాగే వాహనం రంగు వెలిసిపోతుందని మెకానికల్ ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. వాహనాలకు ట్యాంకు నిండా పెట్రోల్ పట్టిస్తే వాహనం పేలి దగ్ధం అయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేసవి కాలంలో వాహనాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మెకానికల్ ఇంజినీరింగ్ నిపుణులు ఏమి చెబుతున్నారంటే...

- వాహనాలు ఎక్కువసేపు పార్కింగ్ చేయాల్సివస్తే చెట్టునీడన, షెడ్లలో పెట్టుకోవాలి.
- దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు వాహనాల వేగానికి ఉష్ణోగ్రతల వేడికి ఇంజిన్ రెండింతలు ఎక్కువ వేడెక్కే అవకాశం ఉంటుంది. అందువల్ల కొంత దూరం ప్రయాణం చేసిన తరువాత ఇంజిన్‌ను కాసేపు నీడలో నిలిపితే మంచిది. లేకుంటే ఇంజిన్‌లో మంటలు చెలరేగే ప్రమాదం ఉంది
- అధిక ఉష్ణోగ్రతల వల్ల టైర్లలో గాలి తగ్గుతూ ఉంటుంది. కనీసం వారానికి ఒకమారైనా వాహనాల్లో గాలిని తనిఖీ చేయించుకోవాలి
- వేసవి కాలంలో వాహనాలకు గాలి తగిన మోతాదులో మాత్రమే పట్టించాలి. ఎక్కువ మోతాదులో పట్టిస్తే టైర్లు పగిలిపోయే ప్రమాదం ఉంది.
- పెట్రోల్‌ను పగలు కంటే సాయంత్రం వేళల్లో పట్టించడం మంచిది.

పెద్ద వాహనాలకు ఇలా చేయాలి

- కార్లు, లారీలు ఇతర భారీ వాహనాల విషయంలో రేడియేటర్లలో నీళ్లు తరచూ తనిఖీ చేసుకోవాలి.
- నీళ్లకంటే కూలెంట్ ఆయిల్ వాడటం మంచిది.
- వేడికి ఇంజిన్ ఆయిల్ తగ్గే అవకాశాలు ఉంటాయి. అందువల్ల తప్పనిసరిగా ఎప్పటిప్పుడు తనిఖీలు చేసుకోవాలి.
- గ్యాస్ ద్వారా వాహనాలను నడిపేవారు కూడా ఎక్కువగానే ఉన్నారు. అలాంటి వారు గ్యాస్‌కిట్‌ను ఉపయోగించకుండా ఉండటం ఉత్తమం.
- ఏసీ నిల్వ ఉండాలంటే అద్దాలకు క్లాత్ మ్యాట్స్ ఏర్పాటు చేసుకోవాలి.
- వేసవి పూర్తయ్యే వరకు భారీ వాహనాలకు కొత్త టైర్లను వాడితేనే మేలు లేదంటే దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పాత టైర్లలో గాలి తగ్గి పేలిపోయే ప్రమాదముంది. ఈ నియమాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

• వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి


కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లి: మర్రిచెట్టు లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి చెంచులక్ష్మిని పట్టు వస్త్రాలతో అలంకరించి సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను రవీంద్రనగర్ కాలనీ దండేవాండ్లపల్లి, లక్కిరెడ్డిపల్లి టౌన్ పరిధిలో ఊరేగించారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ నిర్వహకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మార్ల రవీంద్రారెడ్డి, దండే వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు వై. ప్రసాద్‌యాదవ్, శివశంకర్ రెడ్డి, రామచంద్ర యాదవ్, నాగేంద్ర బాబు, బాల సుబ్రహ్మణ్యం, శివయ్య, దేవేంద్రరెడ్డి, సుదీర్‌కుమార్, ప్రభాకర్ రెడ్డి, దండే వీరయ్య, భక్తులు పాల్గొన్నారు.

• కాలభైరవుడికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో కాలభైరవుడు


హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని భైరవగుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయ ధర్మకర్త ధర్మారెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అంతకు ముందుగా ప్రాంగణంలో హోమం నిర్వహించారు. అలాగే కలశపూజ కూడా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం స్వామిని అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. ఈ పూజలో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• కల్యాణం.. కమనీయం


స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామం బేరిపల్లి సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ లక్ష్మి నరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులందరూ స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు, కుంకుమార్చనలు, పంచామృత అభిషేకములు స్వామి వారికి సమర్పించారు. స్వామి వారికి జి.తిరుపతినాయుడు, నిర్మల దంపతులు 100 గ్రాములు బంగారు పూత కలిగిన వెండి ఆభరణాలను విరాళంగా అందజేశారు.

• ఉత్సవ మూర్తులకు అభిషేకం


పూజల కోసం ఉత్సవ మూర్తులను ముస్తాబు చేసిన కమిటీ సభ్యులు

సిద్దవటం: మండలంలోని జేఎంజే కళాశాలకు ఎదురుగా ఉన్న శ్రీ పెంచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం లక్ష్మీదేవి, చెంచులక్ష్మి సమేత నరసింహ స్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకం పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనరసింహ సహస్ర నామావళి, దీక్షా హోమం, తీర్థ ప్రసాదాల వినియోగం తదితర పూజలు నిర్వహించారు. రాత్రి ఒంటిమిట్ట కళాకారులతో కోలాటం, చెక్క భజనలు నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని దొడ్డపనేని చంద్రశేఖర్ నాయుడు తెలిపారు.

• నేటి నుంచి రేణుకా ఎల్లమాంబ తిరునాల


పూజలు అందుకున్న రేణుకా యల్లమాంబ


సిద్దవటం: మండలంలోని మాచుపల్లె గ్రామంలో పెన్నానది ఒడ్డున వెలసిన శ్రీ రేణుకా ఎల్లమాంబ తిరునాల సోమవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు నిర్వహిస్తామని గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం తెల్లవారుజామున అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 13వ తేదీ మంగళవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు, 14వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ రేణుకా యల్లమ్మ కల్యాణ మహోత్సవం, కోలాటం భజనలు, నిర్వహిస్తామన్నారు. 15వ తేదీ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకుంటారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి రూ. 1,00,116, రెండవ బహుమతి రూ. 70,116, మూడవ బహుమతి రూ. 50,116, నాల్గవ బహుమతి రూ. 30,116, ఐదవ బహుమతి రూ. 20,116 ఇస్తామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కలికిరి: మండలంలోని మహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు) 1985–86 విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. 40 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులు సమావేశమవ్వడంతో పాఠశాల ఆవరణంలో సందడి నెలకొంది. కుటుంబాల యోగక్షేమాలతో పాటు చదువుకున్నప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. బ్యాచ్‌లో కొందరు మరణించి వుండటంతో వారికి సంతాపం తెలిపారు. అప్పటి గురువులైన పి.రెడ్డెప్పరెడ్డి, జి.శ్రీనివాసులు రెడ్డి, కె. ఆనందరెడ్డి, పి.బ్రహ్మరెడ్డిలను ఘనంగా సన్మానించి గురు భక్తి చాటుకున్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని పాఠశాల హెచ్‌ఎం కోరారు. స్పందించిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి అవసరమైన సదుపాయాలు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

మదనపల్లె సిటీ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు మేరీ అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మాజీ మంత్రి రజనిపై సీఐ దౌర్జన్యం చేయడం అవివేకమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన జరుగుతోందన్నారు. మహిళలపై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలు కనీసం గౌరవం కూడా లేదన్నారు. మహిళలపై దౌర్జన్యాలకు దిగితే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు రోలింగ్ మల్లిక, వై జయంతి, జయశ్రీ, అపర్ణ, శారదారెడ్డి, వినూతబాయి, శ్యామల, నాగమణి, మంజుల, ఖాదిరిన్ పాల్గొన్నారు.